ముమ్మరంగా 'ఉపాధి' పనులు



కుంచమర్తిలో కొనసాగుతున్న పశువుల షెడ్ నిర్మాణ పనులు



సీతారాంపురంలో పనులను పరిశీలిస్తున్న ఉపాధిహామీ అధికారులు

- ప్రజాప్రయోజన పనుల ఎంపిక
- పశువుల షెడ్లు, కోళ్ల ఫారాలు, ఇంకుడుగుంతల నిర్మాణం

అర్వపల్లి : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా వివిధ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. జాజిరెడ్డిగూడెం మండలంలో ఈ పథకం కింద రైతులు, పాడి రైతుల కోసం లాభదాయకమైన వివిధ నిర్మాణాలు చేపడుతున్నారు. ముఖ్యంగా పశువుల షెడ్లు, కోళ్ల పారాలు, నాడెపు కంపోస్టు కిట్లు, ఇంకుడు గుంతలు, అజోలా గడ్డి పెంపకం, పెద్ద ఇంకుడు గుంతలు, రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ కట్టడాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పథకం కింద పూర్తిగా నిధులను ఉపాధిహామీ పథకం ద్వారా వెచ్చించి చేపడుతున్నారు.

పలు రకాల పనులు..

జాజిరెడ్డిగూడెం మండలానికి 26 పశువుల షెడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కాగా ఇప్పటికే 15 షెడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ పథకంలో రూ. 83వేలతో పశువుల షెడ్లను నిర్మిస్తున్నారు. రూ. 3లక్షలతో కోళ్ల ఫారం నిర్మిస్తున్నారు. మండలానికి ఒక కోళ్ల ఫారం మంజూరైంది. అలాగే 11 నాడెపు కంపోస్టు కిట్లు మంజూరు కాగా 4 కిట్ల పనులు మొదలయ్యాయి. ఒక్కో కిట్టును రూ. 16వేలతో నిర్మిస్తున్నారు. 32 చిన్న ఇంకుడుగుంతలు మంజూరు కాగా 8 గుంతల పనులు జరుగుతున్నాయి. ఈ పథకంలో ఒక్కో ఇంకుడుగుంతకు రూ. 6వేల చొప్పున చెల్లిస్తున్నారు. అజోలా పశువుల గడ్డిపెంపకం కోసం 17 యూనిట్లు మంజూరు కాగా రెండిటి పనులు జరుగుతున్నాయి. ఒక్కో యూనిట్‌ను రూ. 13వేలతో చేపడుతున్నారు. అలాగే రెండు పెద్ద ఇంకుడుగుంతలు మంజూరయ్యాయి. కాగా వర్షపు నీటిని ఒడిసి పట్టడం కోసం రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ కట్టడాలు 6 మంజూరయ్యాయి. ఒక్కో దానికి రూ. 32,600 ఖర్చు చేస్తున్నారు.

కోళ్ల ఫారం నిర్మించుకుంటున్నా..



ఉపాధి హామీ పథకం ద్వారా కోళ్ల ఫారం షెడ్డు నిర్మించుకోవడానికి రూ. 3లక్షలు మంజూరు కాగా పనులు ప్రారంభించాను. ఈ పథకం ద్వారా పూర్తిగా సబ్సిడీ కింద నిధులు వెచ్చించి షెడ్డు నిర్మించడం సంతోషకరం.

– మర్యాద వెంకన్న, లబ్ధిదారుడు, పర్సాయపల్లి

పనులు జరుగుతున్నాయి



ఉపాధిలో పశువుల షెడ్లు, కోళ్ల ఫారాలు, నాడెపు కంపోస్టు కిట్లు, ఇంకుడుగుంతలు, పశువులకు గడ్డిపెంపకం, రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ కట్టడాలు వంటి పనులను ఎంపిక చేయడం జరిగింది. ప్రస్తుతం అన్ని పనులు జరుగుతున్నాయి.

– సీహెచ్. ఉపేందర్, ఏపీఓ

క్లుప్తంగా

5వ తేదీన దీక్ష

తిరుమలగిరి : తిరుమలగిరిలో ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటును డిమాండ్ చేస్తూ ఈ నెల 5వ తేదీన దీక్ష చేపడుతున్నట్లు తిరుమలగిరి బస్ డిపో సాధన కమిటీ కన్వీనర్ కడెం లింగయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుమలగిరి మండల కేంద్రం నుంచి వివిధ ప్రాంతాలకు ప్రతిరోజు వంద ట్రిప్పుల బస్సులు వెళ్తాయని తెలిపారు. బస్ డిపో ఏర్పాటు వల్ల వ్యాపారపరంగా, విద్యాపరంగా ప్రయోజనాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ దీక్షను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు.

యాసంగి సాగుకు నీటి విడుదల హర్షణీయం



హైదరాబాద్‌లో ఎమ్మెల్యే సామేల్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తుంగతుర్తి : యాసంగి పంటలకు ఎస్సారెస్పీ కాలువల ద్వారా గోదావరి జలాలను విడుదల చేయడం హర్షణీయమని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న అన్నారు. గోదావరి జలాలను విడుదల చేసిన సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌ను కలిసి సన్మానించి మాట్లాడారు. గోదావరి జలాలను విడుదల చేయడంతో ఈ ప్రాంత రైతులకు సాగునీరు అంది పంటలు సమృద్ధిగా పండుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కలకోట్ల మల్లేష్, మంగపల్లి నాగరాజు, దాసరి శ్రీను, కొమ్ము జనార్దన్, శ్రీను పాల్గొన్నారు.

మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడికి పరామర్శ



గోవిందరావును పరామర్శిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని చెట్లముకుందాపురం గ్రామానికి చెందిన సూర్యాపేట జిల్లా మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండమీది గోవిందరావుకు ఇటీవల గుండెపోటు రావడంతో ఆపరేషన్ చేయగా చికిత్స పొందుతున్నాడు. సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు గురువారం ఆయనను హైదరాబాద్‌లో కలిసి పరామర్శించారు. ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కొలిశెట్టి యాదగిరిరావు, డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కోట గోపి పాల్గొన్నారు.

సాంస్కృతిక సంఘం అధ్యక్షుడిగా సైదులు

తుంగతుర్తి : తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సంఘం మండల అధ్యక్షుడిగా చింతకుంట్ల సైదులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆ సంఘం నియోజకవర్గ కార్యదర్శి తడకమళ్ల పరశురాం ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పుల రాంబాబు, రాంమూర్తి, గంగరాజు, బొంకూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నివాళి


అర్వపల్లి : తిమ్మాపురం గ్రామానికి చెందిన ఎడ్ల సత్తెమ్మ గురువారం అకాల మరణం చెందారు. మృతురాలుకు గ్రామ మాజీ సర్పంచ్‌లు జీడి వీరస్వామి, పాలెల్లి సురేష్‌లు నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ నాయకులు నల్లగుంట్ల నాగేందర్, ఎడ్ల సతీష్, బింగి బాలరాజు, పాలెల్లి రామారావు, శ్రీను, వెంకన్న, మల్లయ్య, రాములు, రవి, నర్సింహారావు, భాస్కర్, కనకయ్య, సంతోష్, చంద్రయ్య, సుధీర్, నరేష్ తదితరులు ఉన్నారు.

పనులకు శంకుస్థాపన

మోతె : మండలంలోని అన్నారిగూడెం, కరక్కాయలగూడెం గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.8 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అన్నారిగూడెం గ్రామ శాఖ అధ్యక్షుడు మేరమెట్ల వెంకటనారాయణ, మాజీ సర్పంచ్‌లు దున్నపోతుల ఆదినారాయణ, శీత శ్రీను, నాయకులు దుశ్చర్ల శ్రీనివాస్, కటికం శ్రీను, రెడ్డిమళ్ల సత్యం, ఆలకుంట్ల ముత్తయ్య, ముఖర్జి, తదితరులు పాల్గొన్నారు.

వననర్సరీల పరిశీలన

అర్వపల్లి : మండల పరిధిలోని కుంచమర్తి, అర్వపల్లి, అడివెంల తదితర గ్రామాల్లో గురువారం వననర్సరీలలో విత్తనాలు నాటే పనులను ఉపాధిహామీ పథకం ఏపీఓ సీహెచ్.ఉపేందర్ పరిశీలించారు. అలాగే పశువుల షెడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈసీ నగేష్, టీఏ నాగమణి, కార్యదర్శి గుండగాని మహాలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్‌లు గంగ, ఏడుకొండలు, మల్లయ్య పాల్గొన్నారు.



వననర్సరీని పరిశీలిస్తున్న ఏపీఓ ఉపేందర్

సంక్రాంతికి ప్రత్యేక బస్సు సర్వీసులు



సూర్యాపేట ఆర్టీసీ డిపోను సందర్శిస్తున్న ఆర్ఎం

భానుపురి : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా 400 ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం జానిరెడ్డి తెలిపారు. గురువారం సూర్యాపేట కొత్త బస్టాండ్‌లో చేపట్టిన బస్టాండ్ ఆవరణ ఫ్లోరింగ్, మహాలక్ష్మీ టాయిలెట్స్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సంక్రాంతి పండుగకు సూర్యాపేట నుంచి హైదరాబాద్, నల్లగొండ, మిర్యాలగూడెం పట్టణాలకు ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో అన్ని ఆర్టీసీ డిపోల్లో రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహిస్తూ ఆర్టీసీ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సురేందర్, సీఐ సైదులు, సిబ్బంది కిరణ్, ప్రభాకర్, ఆర్.వి.సింగ్, వెల్ఫేర్ బోర్డు సభ్యులు యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్ హమాలీల నిరవధిక సమ్మె



తుంగతుర్తిలో సమ్మె చేస్తున్న సివిల్ సప్లయ్ హమాలీ నాయకులు

తుంగతుర్తి : సివిల్ సప్లయ్ హమాలీలకు పెంచిన కూలి రేట్ల జీఓను వెంటనే అమలు చేయాలని సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొంకూరి శ్యామ్‌సుందర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.రాజారామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని సివిల్ సప్లయ్ గోదాం ఎదుట నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సివిల్ సప్లయ్ హమాలీలకు, కమిషనర్‌కు మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం పెంచిన కూలి రేట్లను అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థలో పనిచేస్తున్న కార్మికుల రేట్ల జీఓ అమలు చేసి, ఏరియర్స్ అమలు చేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ హమాలీలు ఎం.వెంకన్న, లక్ష్మయ్య, వీరస్వామి, అవిలయ్య, ఎల్లయ్య, సురేష్, రవి, రమేష్, వెంకన్న, హరికృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సహకారం అభినందనీయం



పెన్‌పహాడ్‌లో విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న ఎంఈఓ

పెన్‌పహాడ్ : విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయుల సహకారం అభినందనీయమని ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న జి. ఆనందభాస్కర్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు గురువారం ప్రత్యేక తరగతుల్లో భాగంగా ఉదయం, సాయంత్రం అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు ఆనందభాస్కర్ మాట్లాడారు. ప్రత్యేక తరగతులు ముగిసేంత వరకు హిందీ సబ్జెక్టు రోజున అల్పాహారం అందించనున్నట్లు తెలిపారు. తాను ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన ప్రతి పాఠశాలలోనూ విద్యార్థులకు అల్పాహారం అందించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన కోరారు. అనంతరం ఉపాధ్యాయుడు ఆనందభాస్కర్‌ను ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణప్రసాద్, మనోహర్, రఫియా, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోవింద మాలధారుల మండల పూజ



స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు



వేడుకలో పాల్గొన్న గోవింద మాలధారులు

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం గోవింద మాల భక్త బృందం ఆధ్వర్యంలో మండల పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్‌చక్రవర్తుల వేణుగోపాల ఆచార్యులు, అర్చక బృందం ఆధ్వర్యంలో స్వామి వారికి 108 కలశములతో తిరుమంజన స్నపనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పళ్ల రసాలు, శుద్ధోదకం, గంధోదకం, పుష్పోదకం, ఫలోదకం, దూపదీపాలతో మండల పూజ జరిపారు. అనంతరం భక్తులందరికీ అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు హరిచరణ్‌ఆచార్యులు, శ్రీహరి ఆచార్యులు, గోవింద మాల భక్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల క్యాలెండర్లు ఆవిష్కరణ



చివ్వెంల : క్యాలెండర్ ఆవిష్కరణలో పాల్గొన్న డీటీఎఫ్ నాయకులు



అర్వపల్లి : క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు



ఆత్మకూర్(ఎస్) : జెడ్పీహెచ్‌ఎస్‌లో..



తుంగతుర్తి : ఎమ్మార్సీ కార్యాలయంలో..

ఆత్మకూర్(ఎస్) : విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి ధారాసింగ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డీటీఎఫ్ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డీటీఎఫ్ ఉన్నత ఆశయంతో వృత్తి నిబద్ధత, సామాజిక బాధ్యతతో పనిచేస్తోందని తెలిపారు. అనంతరం డీటీఎఫ్ నాయకులు మాట్లాడారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్లు యోగానంద చారి, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రావన్‌కుమార్, పబ్బతి వెంకటేశ్వర్లు, కొచ్చర్ల వేణు, మండల అధ్యక్షుడు బొల్లెద్దు వెంకన్న, వనజ పాల్గొన్నారు.

తుంగతుర్తి : డీటీఎఫ్ 2025 సంవత్సర క్యాలెండర్లు, డైరీని గురువారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ బోయిని లింగయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ నాయకులు మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారంలో డీటీఎఫ్ ముందుంటుందన్నారు. అలాగే తుంగతుర్తిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో డీటీఎఫ్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎం ప్రవీణ్‌కుమార్, డీటీఎఫ్ నాయకులు వెంకటమల్లు, వెంకన్న, మధు, కోటయ్య, యాకయ్య, హకీం, సహదేవ్, రాజయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల : డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రమణ, డీటీఎఫ్ నాయకులు వెంకటేశ్వర్లు, జె.రమణ, బి.క్రాంతికుమార్, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సాహెబ్ అలీ, రామకృష్ణ, వెంకటరమణ చారి, విజయ్ కుమార్, రమాదేవి, శ్రావణ్ పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ

అర్వపల్లి : టీఎస్‌యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్లను గురువారం తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో మండల నోడల్ అధికారి, కాంప్లెక్స్ హెచ్‌ఎం కుంభం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాకి శీనయ్య, నోముల వెంకటేశ్వర్లు, మహిళా ఉపాధ్యక్షురాలు ఎస్.విజిత, కోశాధికారి, యు.శేఖర్, వర్దెల్లి కృష్ణయ్య, కె. నర్సయ్య, సబియా సుల్తాన, ఎండీ. రెహనాబేగం, పి.రాములు, సీహెచ్. శ్రీనివాస్, రవీందర్, దాసయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు



ఆత్మకూర్(ఎస్) : ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా గురువారం 18వ రోజు మహిళలు మంగళహారతులతో వచ్చి గోదాదేవికి కుంకుమార్చన నిర్వహించారు. అలాగే భక్తి కీర్తనలు ఆలపించారు. అర్చకులు 18వ పాశురాన్ని పఠించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గోదాదేవికి మంగళహారతులతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం తీర్థ ప్రసాదాల వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పూజారి కాటూరి రామాచార్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) : ఆత్మకూరు మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు అత్యంతవైభవంగా జరుగుతున్నాయి. గురువారం 18వ విశేష పాశురమును పురస్కరించుకుని ఆలయ అర్చక స్వాములు శ్రీమాన్ నూగూరు వెంకట రంగాచార్యులు, శ్రీనివాసాచార్యులు, రమాకాంతాచార్యులు, శ్రీకాంత్ ఆచార్యులు శ్రీ గోదాదేవిని గాజుల మాలలు, తిరు ఆభరణములు, పూల మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీ గోదా కృష్ణ గోష్ఠిబృందంతో కలిసి తిరుప్పావై దివ్య ప్రబంధాన్ని పారాయణం చేశారు. అనంతరం తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, భక్తజనం పాల్గొన్నారు.



జాజిరెడ్డిగూడెం దేవాలయంలో పూజలు..



తుంగతుర్తి : రామాలయంలో..

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కళాజాత



డి.కొత్తపల్లిలో ప్రజాపాలనపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం సభ్యులు

నాగారం : మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామంలో సాంస్కృతిక సారథి కళాకారులు గురువారం ప్రజా పాలన, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై, గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక సారథి టీం లీడర్ ఈర్ల సైదులు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేయాలన్నారు. అనంతరం కళాబృందం సభ్యులు తమ ఆట, పాటల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి అరుణ్, కళాజాత బృందం సభ్యులు గడ్డం ఉదయ్, వెన్నెల నాగరాజు, పాలకుర్తి శ్రీకాంత్, డప్పు శంకర్, పాక ఉపేందర్, మేడిపల్లి వేణు, మద్దిరాల మంజుల, సిరిపొంగి రాధ, నెమ్మాది స్రవంతి, మల్లెపాక శిరీష పాల్గొన్నారు.

కోదాడ మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

నడిగూడెం : కోదాడ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నూతనంగా ఎంపికైన ఏపూరి తిరుపతమ్మను గురువారం నడిగూడెంలో మానవ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు గంటెపంగు నాగార్జున్, నాయకులు సుధీర్, రాహుల్, నవీన్‌కుమార్, నమ్రుత్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



మద్దిరాలలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న మార్త కృష్ణమూర్తి

మద్దిరాల : సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేద కుటుంబాలకు వరంలాంటిదని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మార్త కృష్ణమూర్తి అన్నారు. మండల కేంద్రానికి చెందిన మల్లారపు రమణమ్మ అనారోగ్యం కారణంగా వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి చొరవతో రూ.60వేల చెక్కు మంజూరైంది. ఈ చెక్కును కృష్ణమూర్తి గురువారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు నలమాస ఉపేందర్, యూత్ వైస్ ప్రెసిడెంట్ దండెంపల్లి ఉమేష్, మల్లారపు కాశయ్య, రాంపాక సత్తయ్య, మట్టిపెల్లి మల్లేష్, చామకూరి కర్ణ, మల్లారపు వెంకన్న, చామకూరి నరేష్, కొత్తపల్లి శేఖర్, సోహెల్, అంకటి మహేష్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

దేశ రాజకీయాల్లో ఏబీ బర్ధన్ పాత్ర కీలకం



ఏబీ బర్ధన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

హుజూర్‌నగర్ : దేశ రాజకీయాల్లో సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి ఏబీ బర్ధన్ పోషించిన పాత్ర కీలకమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఏబీ బర్ధన్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో సంకీర్ణ రాజకీయాలను సమర్థంగా నడిపిన నాయకుడు ఏబీ బర్ధన్ అని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కంబాల శ్రీనివాస్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లేశ్వరి, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, యల్లావుల రమేష్, జక్కుల శ్రీను, జడ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా మట్టి పోయించాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నూతనకల్ : మండల పరిధిలోని పెద్ద నెమిల గ్రామంలో సీసీ రోడ్లకు ఇరువైపులా మట్టి పోయించాలని కోరుతూ బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ సునీతకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మూడు నెలల క్రితం 10వ వార్డులో నిర్మించిన సీసీ రోడ్డుకు ఇరువైపులా మట్టిపోయాల్సి ఉన్నప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్ మట్టి పోయకపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు చిప్పలపెల్లి అమర్‌నాథ్, ఎ. మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వేల్పుచర్ల జీపీ భవనానికి నిధులు

- ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రూ.20 లక్షలు మంజూరు



వేల్పుచర్లలో అద్దె భవనంలో నడుస్తున్న గ్రామ పంచాయతీ కార్యాలయం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం వేల్పుచర్లలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. 2018 సెప్టెంబర్‌లో ఈ గ్రామం గ్రామ పంచాయతీగా ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు గ్రామ పంచాయతీ కార్యాలయం అద్దె భవనంలోనే నడుస్తోంది. అద్దె భవనంలో కనీస వసతులు లేక గ్రామ పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలోనే సొంత భవన నిర్మాణానికి నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపారు.

త్వరలో పనులు..

ఉపాధిహామీ పథకం ద్వారా రూ. 20 లక్షలు మంజూరయ్యాయి. కాగా భవన నిర్మాణం కోసం స్థలాన్ని కూడా కేటాయించారు. ఈ నిధులతో గ్రామ పంచాయతీ కార్యాలయానికి తగు వసతులతో కూడిన భవనాన్ని నిర్మించనున్నారు. భవన నిర్మాణం జరిగితే కొత్తగా ఎన్నికయ్యే పాలకవర్గానికి, సిబ్బందికి, గ్రామస్తులకు ఇబ్బందులు తీరనున్నాయి.

నిధుల మంజూరు హర్షణీయం



వేల్పుచర్లలో జీపీ భవన నిర్మాణానికి ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రూ.20 లక్షలు మంజూరు కావడం హర్షణీయం. తన హయాంలో భవన నిర్మాణానికి నిధుల మంజూరుకి ప్రతిపాదలను పంపించాను. తొందరగా భవన నిర్మాణాన్ని అధికారులు పూర్తి చేయించాలి.

- కమ్మంపాటి కరుణాకర్, మాజీ సర్పంచ్